
సాక్షి
గుంటూరు
సోమవారం। 30। జూన్। 2025



కనక దుర్గమ్మకు బోనాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీనగర్‌లో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 514.20 అడుగుల వద్ద ఉంది. ఇది 138.9118 టీఎంసీలకు సమానం.

నిమ్మకాయల అలంకరణలో మహంకాళి అమ్మవారు



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న శ్రీ మహంకాళి ఆలయంలో ఆషాఢ మాసం తొలి ఆదివారం సందర్భంగా అమ్మవారు నిమ్మకాయల దండల అలంకరణలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

వైభవంగా సుభద్ర అమ్మవారి శోభాయాత్ర



తాడేపల్లిరూరల్: తాడేపల్లిలో ఆదివారం సుభద్ర అమ్మవారి శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా సుభద్ర అమ్మవారికి ఇస్కాన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో సారె సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం శ్రీమద్విరాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి వివిధ రకాల పూలు, సారెలతో ప్రకాశం బ్యారేజ్ మీదుగా విజయవాడ సీతమ్మవారి పాదాలవరకు యాత్ర నిర్వహించారు. దారిపొడవునా యువతులు, చిన్నారులు కోలాటాలు, నృత్యాలతో అలరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన నాట్యం ప్రాక్టికల్ పరీక్షలు



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠంలో మూడు రోజులుగా జరుగుతున్న సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పరీక్షలకు 21 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షలకు అధికారిగా వ్యవహరించిన సుధీర్ రావు తెలిపారు. కళా పీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాల కృష్ణ నట్టువాంగంతో, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి మృదంగంపై సహకరించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

గుణదల(విజయవాడ తూర్పు): సర్వమానవాళి రక్షణ ప్రణాళికలో భాగంగా ఏసుక్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని, ఆయన అనుసరణీయమని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం ఉదయం సమష్టి దివ్య బలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అనుదిన ప్రార్థనతో పాటు భక్తి విశ్వాసాలను కొనసాగించాలని వివరించారు. దేవుడు బోధించిన ప్రేమ, జాలి, దయ వంటి సద్గుణాలను కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు.

అర్ధరాత్రి మట్టి తవ్వకాలు

స్థానికుల నిలదీతతో జారుకున్న దుండగులు



కొలకలూరు(తెనాలి): పంటపొలాల్లో మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్న వైనం తెనాలి రూరల్ మండలం కొలకలూరులో జరిగింది. అక్రమ తరలింపును గుర్తించిన స్థానికులు అడ్డుకోవడంతో దుండగులు జారుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. కొలకలూరు గ్రామ జగనన్న కాలనీ సమీపంలోని ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న పొలాల్లో శనివారం అర్ధరాత్రి తర్వాత కొందరు వ్యక్తులు పొక్లెయిన్లతో మట్టిని తవ్వుతూ అక్రమంగా ట్రాక్టర్లకు ఎత్తి తరలించే యత్నం చేశారు. పొక్లెయిన్ల శబ్దానికి సమీపంలోని వారు నిద్రలేచి వచ్చి అధికారుల అనుమతి లేకుండా అర్ధరాత్రి మట్టి తవ్వకాలేమిటంటూ ప్రశ్నించారు. దీనికి తాము తమ పొలంలోని మట్టిని సరిచేసుకుంటున్నామని చెప్పగా, మట్టిని బయటకు తరలించటాన్ని తాము చూశామని, అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించటంతో వారు అక్కడ్నుంచి పొక్లెయిన్, ట్రాక్టర్లతో సహా జారుకున్నారు. దీన్నంతా వీడియో తీసి కొందరు మండల తహసీల్దార్‌కు పంపారు. తహసీల్దార్ ఆదేశాలపై గుడివాడ వీఆర్‌ఓ భాను ఉదయాన్నే మట్టి తవ్వకం జరిగిన ప్రాంతాన్ని సందర్శించి, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముందుచూపు 0 చేరికలు

కూటమి సర్కారు పాఠశాలల విలీనం పేరిట చేస్తున్న ప్రయోగాలు వికటించి, తరగతులకు తరగతులు ఖాళీ అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా పల్నాడులో 179 పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో చేరికలు సున్నా కావడం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పాఠశాలలు దూరంగా ఉండడం, అక్కడివరకు పంపలేక.. ఆర్థిక భారమైనా సమీపంలోని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పేందుకే తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

179 స్కూళ్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్

- పల్నాడు జిల్లాలోని 179 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థీ చేరని వైనం
- పాఠశాల విద్యలో ప్రభుత్వ ప్రయోగాల ఫలితం
- మోడల్ ప్రైమరీ స్కూళ్ల ప్రభావంతో గ్రామాల్లో ప్రైమరీ పాఠశాలలు మూతపడే ప్రమాదం
- వైఎస్సార్ సీపీ పాలనలో సజావుగా కొనసాగిన ప్రభుత్వ పాఠశాలలు



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో కూటమి ప్రభుత్వం చేసిన ప్రయోగాలు వికటిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు విద్యార్థుల ప్రవేశాలు లేక మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమైన తరువాత ఒకటో తరగతిలో ఒక్క విద్యార్థి కూడా చేరని పాఠశాలలే ఇందుకు ఉదాహరణ. పల్నాడు జిల్లావ్యాప్తంగా 179 ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటివరకూ ఒకటో తరగతిలో కనీసం ఒక్క విద్యార్థి సైతం చేరకుండా ఉండటం విద్యారంగ చరిత్రలో ఇదే మొదటిసారి.

దీనావస్థలో ప్రభుత్వ విద్య

విలీనం పేరుతో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలలను సమీప పాఠశాలల్లో కలిపేయడం, మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు అంటూ ప్రాథమికస్థాయిలో విద్యార్థులకు విద్యను దూరం చేయడం వంటి కారణాలతో ఒకటో తరగతిలో విద్యార్థుల ప్రవేశాలు లేక పాఠశాలలు దీనావస్థలోకి వెళ్లిపోయాయి. ఈ విధంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలను పరిశీలిస్తే ఒక పల్నాడు జిల్లాలోనే 179 పాఠశాలలు ఉండటం గమనార్హం.

వికటించిన ప్రయోగాలు

విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో సంబంధిత పాఠశాలల్లోని విద్యార్థులను సమీప పాఠశాలల్లో విలీనం చేసిన కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పేరుతో కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు హడావుడి చేసింది. గ్రామంలోని వేర్వేరు కాలనీల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న నాలుగైదు ప్రాథమిక పాఠశాలల స్థానంలో ఒకటే పాఠశాల ఉండాలనే ప్రభుత్వ విధానంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకే దూరమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి.

కిలోమీటర్ల కొద్దీ నడవలేక..



పాఠశాలకు వెళ్లి రావడం దూరాభారం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజూ కిలో మీటర్లు కొద్దీ నడిపించేందుకు ఇష్టపడక, ఆర్థిక భారమైనా స్థానికంగా ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ల ప్రభావంతో గ్రామాల్లో మిగిలిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఏర్పడింది. ప్రాథమిక పాఠశాలలకు సరిపడా ఉపాధ్యాయులను కేటాయించకుండా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చివేయడంతో విద్యార్థుల ప్రవేశాలు సైతం పడిపోతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో సజావుగా..



ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాల మూతబడలేదు. ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చి, విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం ద్వారా పాఠశాలలు సక్రమంగా కొనసాగే పరిస్థితులను నాడు కల్పించారు. అయితే నేడు కూటమి పాలనలో తీసుకున్న నిర్ణయాలు, చేస్తున్న ప్రయోగాలతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కోల్పోయే దుస్థితి ఏర్పడింది.

బోనభాగ్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): తెలంగాణ హైదరాబాద్‌లోని భాగ్యనగర్ శ్రీమహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల కమిటీ తరఫున ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆదివారం బంగారు బోనాన్ని సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలతో రైతులు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ గత 16 ఏళ్లుగా ఏటా ఆషాఢ మాసంలో దుర్గమ్మకు బంగారు బోనం సమర్పించడం ఆనవాయితీ. ఆదివారం ఉదయం బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి బోనాల కమిటీ ప్రతినిధులు, దుర్గగుడి ఈవో శీనానాయక్ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, తీన్‌మార్ డప్పులు, బేతాళ నృత్యాలు, కళాకారులు విన్యాసాలు, వివిధ వేషధారణలు, పోతురాజుల విన్యాసాలతో వైభవంగా ఊరేగింపు ప్రారంభమైంది. తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ సుమారు 500 మంది కళాకారులు తమ కళలను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు.

భక్తుల బారులు..

జోగిని శ్యామలాదేవి బంగారు బోనాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపులో ముందుకు సాగగా.. వెండి తదితర బోనాలతో మిగిలిన వారు ముందుకు సాగారు. బంగారు బోనాన్ని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రి పరిసరాలకు తరలివచ్చారు. దుర్గాఘాట్‌కు చేరుకున్న ఊరేగింపు కృష్ణమ్మకు గంగ తెప్పను సమర్పించిన పట్టుచీర, పూలు, పండ్లు, పూజా సామగ్రిని సమర్పించారు. అనంతరం దుర్గాఘాట్, ఘాట్‌రోడ్డు మీదగా ఊరేగింపు ఆలయ ప్రాంగణానికి చేరుకుంది.



ఫణిదరంలో తాగునీటి చెరువును భారీ పొక్లెయిన్లతో తవ్వుతున్న కూటమి నేతలు

ఆగని మట్టి దందా

- తాడికొండ మండలం ఫణిదరంలో నెల రోజులుగా యథేచ్ఛగా మట్టి దోపిడీ చేస్తున్న కూటమి నేతలు
- షాడో ఎమ్మెల్యే కనుసన్నల్లో వ్యవహారం
- చెరువులో ఏర్పడిన భారీగుంతలు
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు
- గుంటూరుతో సహా పరిసర గ్రామాలకు భారీగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్న వైనం



మట్టి తవ్వకాలతో చెరువులో ఏర్పడిన భారీ గుంతలు

తాడికొండ: అధికారుల అలసత్వం, నాయకుల పైరవీల కారణంగా తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో తెలుగు తమ్ముళ్ల మట్టిదందా నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది. గ్రామంలోని మంచినీటి చెరువులో తవ్వకాలు చేస్తూ టన్నుల కొద్దీ మట్టిని ట్రాక్టర్లు, లారీలలో రాత్రీ, పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు గుంటూరు కలెక్టరేట్‌కు వెళ్లి మరీ ఫిర్యాదు చేసినా ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

అంతా షాడో కనుసన్నల్లోనే..

మట్టిదందా అంతా నియోజకవర్గ ముఖ్య నేతకు చెందిన కార్యాలయంలో ఉంటున్న ఓ వ్యక్తి కనుసన్నల్లో కొనసాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతా ఆయనే అయి షాడో ఎమ్మెల్యేగా వ్యవహారం నడిపిస్తూ జేబులు నింపుకొంటుంటే చూస్తూ ఊరుకోవడం తప్ప తామేం చేయలేకపోతున్నామంటూ టీడీపీ నాయకులే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. ఇప్పటికే అధికారులను సైతం బెదిరించి తన వశం చేసుకున్న సదరు వ్యక్తి.. ప్రజా సమస్యలు పక్కన బెట్టి మట్టి దందాకు నియోజకవర్గంలో భారీగా తెరలేపాడు. ఇక్కడ అక్కడ అనే బేధం లేకుండా నియోజకవర్గ వ్యాప్తంగా తమవారిని తెరపైకి తెచ్చి భారీగా మట్టి దందా నిర్వహిస్తున్నాడు. ఫిరంగిపురం మండలం అమీనాబాద్‌లో మరింత బరి తెగించి దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో భారీగా తవ్వకాలు జరపడం వెనుక షాడో ఎమ్మెల్యే హస్తం ఉందని ఇప్పటికే పలువురు టీడీపీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మట్టి దందాకు ఇకనైనా అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎట్టకేలకు సీనియార్టీ లిస్టులు

- సీనియార్టీ లిస్టులు లేకుండానే శనివారం సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్
- 'సాక్షి' కథనంతో అధికారుల్లో కదలిక
- ముగిసిన బదిలీల కౌన్సెలింగ్
- గందరగోళంగా మారిన వార్డు అడ్మిన్ సెక్రటరీలు, బిల్ కలెక్టర్ల వ్యవహారం

సాక్షి ఎఫెక్ట్



వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పెట్టిన సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ లిస్ట్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని యూఎల్‌బీ పరిధిలో పనిచేస్తున్న వార్డు ఎమినిటీ సెక్రటరీలు, వార్డ్ ప్లానింగ్ సెక్రటరీల బదిలీలకు సంబంధించిన కౌన్సె లింగ్ ఆదివారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. శనివారం వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే శనివారం జరిగిన కౌన్సెలింగ్‌లో ఎటువంటి సీనియార్టీ లిస్ట్ పెట్టకుండానే నచ్చిన సచివాలయాలను మూడు ఆప్షన్లుగా ఎంచుకుని ఆప్షన్ ఫాం ఇచ్చి వెళ్లిపోండి ఈనెల 30న మీకు సచివాలయం కేటాయిస్తామని అధికారులు చెప్పిన విషయం విదితమే.. దీనిపై 'సచివాలయ ఉద్యోగుల్లో ట్రాన్స్'ఫేయర్'' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు రెండో రోజు ఆదివారం జరిగిన వార్డు ఎమినిటీ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్‌కు సంబంధించిన సీనియార్టీ లిస్టును ప్రచురించారు. దీంతో ఆయా సెక్రటరీలు ఊపిరి పీల్చుకున్నారు.

వార్డు అడ్మిన్లు వర్సెస్ బిల్ కలెక్టర్లు

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వార్డు/గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సచివాలయాలకు వార్డు అడ్మిన్ సెక్రటరీలతో పాటు గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న బిల్ కలెక్టర్లుకు కూడా వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా అవకాశం కల్పిస్తూ పోస్టింగ్ ఇచ్చారు. 2019లో బిల్ కలెక్టర్లకు వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా ముందు ప్రాధాన్యత కల్పించి పోస్టింగ్‌లు ఇచ్చారు. అయితే ప్రస్తుతం బదిలీల కౌన్సెలింగ్ జరుగుతున్న నేపథ్యంలో బిల్ కలెక్టర్లు వారు ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయాల్లోనే ఉండేవిధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని హోల్డ్ చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో వార్డు అడ్మిన్ సెక్రటరీలు అలా హోల్డ్ చేసుకోవడం కుదరదంటూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 23 మంది బిల్ కలెక్టర్లు వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా పనిచేస్తున్నారు. వీరంతా తాము ఐదేళ్ల నుంచి వార్డు అడ్మిన్ సెక్రటరీలుగా పనిచేస్తున్నామని, తమకు ప్రాధాన్యత ఇచ్చి నచ్చిన సచివాలయం కేటాయించాలని కోరుతుండగా.. అధికారులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఈ బదిలీల కౌన్సెలింగ్ ఒక కొలిక్కి రావాలంటే సోమవారం వరకు వేచి చూడాల్సిందేనని జీఎంసీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.



కౌన్సెలింగ్ పేపర్లను పరిశీలిస్తున్న సిబ్బంది



పసిబిడ్డతో కౌన్సెలింగ్‌కు వచ్చిన సచివాలయ ఉద్యోగిని

గిరిజన ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

బొల్లాపల్లి: గిరిజన ప్రాంతాల్లో పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కేంద్ర షెడ్యూల్డ్ కులాల మంత్రిత్వ శాఖ అధికారి చతుర్వేది అన్నారు. ధర్తి ఆబ జన భాగిదరి అభియాన్ కింద ఎంపికైన మండలంలోని పాపాయపాలెం, మూడు తూముల తండా, బ్రిడ్జి తండా వంటి గిరిజన ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ అధికారులు ఆదివారం పర్యటించారు. స్థానిక ఎంపీడీఓ పి.సీతారామయ్యతోపాటు ఇతర అధికారులు వెంట ఉన్నారు. ఈ సందర్భంగా చతుర్వేది మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, ఇళ్లులేని వారికి పక్కా గృహాలు నిర్మించనున్నట్లు చెప్పారు.

వైభవంగా పునీత పేతురు మహోత్సవం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం శ్రీసభ కార్యక్రమం నిర్వహించారు. పునీత పేతురు, పౌల్‌ల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించి వాక్యోపదేశం చేశారు. పునీత పేతురు, పౌల్‌లు తమ జీవితంలో భగవంతుడిపై విశ్వాసాన్ని ఏవిధంగా చూపి నిలుపుకున్నారో దానిని విశ్వాసులు తెలుసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఒకే కుటుంబంగా కలిసి ప్రార్థనలు చేయాలని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్మెల్ మాత మహోత్సవం జూలై 14,15,16 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. సహాయ విచారణ గురువులు, మఠ కన్యలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రెంటచింతల: స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెంటచింతలకు గ్రామానికి చెందిన నలుగురు యువకులు గాయపడ్డారు. రెండు ద్విచక్ర వాహనాలు బలంగా ఢీ కొనడంతో గుర్రాల మనోహర్, నాని తీవ్రంగా గాయపడగా వారిని ప్రథమ చికిత్స అనంతరం పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కోటయ్య, వెంకటేష్‌లను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ జట్ల ఎంపిక

బాపట్ల: జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ ఇంటర్ స్కూలు జట్ల ఎంపిక పూర్తయిందని సెక్రటరీ డాక్టరు బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో 16 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. అండర్–14 విభాగంలో లిటిల్ ఏంజెల్స్ స్కూలు ప్రథమ స్థానం, ఢిల్లీ పబ్లిక్ స్కూలు ద్వితీయ స్థానంలో నిలిచాయని తెలియజేశారు. అండర్–17 విభాగంలో శాంతి క్రికెట్ అకాడమి ప్రథమ స్థానం, బాపట్ల ఆక్స్‌ఫర్డ్ స్కూలు ద్వితీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. అండర్–17 బాలికల విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూలు జట్లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు అర్హత సాధించాయని ఆయన వెల్లడించారు.

నేడు పొగాకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజకవర్గ పరిధిలోని బ్లాక్ బర్లీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే నిమిత్తం రాష్ట్ర గృహనిర్మాణం, సమాచారం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి సోమవారం పర్చూరు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ అధికారులు తెలిపారు. నియోజక వర్గంలోని జె.పంగులూరు, ఇంకొల్లు, పర్చూరు మండల కేంద్రాల్లో బ్లాక్ బర్లీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. ఆయనతోపాటు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ జె.వెంకట మురళి హాజరవుతారని తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం



అమర్తలూరు(వేమూరు): బావిలో మహిళ శవం గుర్తించారు. ఎస్ఐ కుంచాల రవితేజ తెలిపిన వివరాలు... అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామ పరిధిలోని తిరుపతమ్మ గుడి వద్ద గల బావిలో 50 సంవత్సరాలు మహిళ శవం కనిపించింది. వీఆర్వో యడల ఆదాం సమాచారం మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిఫార్సు బదిలీలు!

- గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖ ఉన్నవారికే ప్రాధాన్యం!
- గుంటూరు సిటీకి వచ్చేందుకు ఒక్కో లేఖకు రూ.50వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- ఆందోళనలో మహిళా పోలీసులు



నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు ఆదివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. అయితే ఈ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా, కేవలం సిఫార్సు లేఖలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి.

సిఫార్సు ఉన్నవారికే ప్రథమ ప్రాధాన్యం

2019లో సచివాలయ మహిళా పోలీసులకు వచ్చిన ర్యాంకు, వారి అర్హత, టెక్నికల్ క్వాలిఫికేషన్ బట్టి వారికి ఆయా సచివాలయాల్లో పోస్టింగ్ కల్పించారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కేవలం వార్డు టూ వార్డు సచివాలయానికి మాత్రమే బదిలీలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ ఆ విధంగా కాకుండా ఉమ్మడి జిల్లాలో ఏ ప్రాంతానికైనా బదిలీ చేస్తామని అధికారులు తెగేసి చెబుతున్నారు. ఒక వేళ ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు ఉంటే వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఖరాకండిగా చెబుతుండంతో సిఫార్సు లేఖలు తెచ్చుకోలేని మహిళా పోలీసుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

ఒక్కో లేఖకు రూ.40వేల నుంచి రూ.50వేల దాకా వసూలు !

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 1100 మంది దాకా మహిళా పోలీసులు ఉన్నారు. వీరందరికీ ఆదివారం కౌన్సెలింగ్ జరిగింది. అయితే ఇందులో రూరల్ ప్రాంతంలో పనిచేసే మహిళా పోలీసులు అర్బన్ ప్రాంతానికి వచ్చేందుకు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఒక్కో సిఫార్సు లేఖకు రూ.40వేల నుంచి రూ.50వేల దాకా వసూలు చేస్తునట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేల దగ్గర నుంచి గుంటూరు నగరంలో పోస్టింగ్ కోసం ఒక్కో మహిళా పోలీసు 5 నుంచి 10 దాకా వారి వారి పలుకుబడిని బట్టి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనారోగ్యం, సీనియార్టీ, ర్యాంక్‌తో పనిలేదు?

ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో దివ్యాంగులకు, విజువల్లీ ఛాలెంజ్‌డ్, కిడ్నీ మార్పిడి, క్యాన్సర్ వంటి రోగులతో పాటు, స్పౌజ్ కేటగిరి వారికి ప్రథమ ప్రాధ్యానం ఇవ్వాలి. కానీ ఇక్కడ ఇవేమీ అమలు జరగడం లేదు. కేవలం ఎమ్మెల్యే సిఫార్సు లేఖలే పనిచేస్తుండడంతో అర్బన్‌లో పనిచేస్తున్న మహిళా పోలీసులు రూరల్‌కు బదిలీ అవుతామేమోననే భయాందోళనలో ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం పాత్ర కీలకం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- లీగల్‌సెల్ ఆధ్వర్యంలో అంబటికి సత్కారం



అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి, న్యాయవాదులు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి లీగల్ విభాగం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన అంబటిని ఆదివారం సత్కరించారు. అరండల్‌పేటలోని లీగల్ విభాగం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హాజరయ్యారు. ముందుగా న్యాయవాదులు, లీగల్ విభాగం నేతలు అంబటిని సత్కరించి, అభినందనలు తెలిపారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన నేపథ్యంలో లీగల్ విభాగం సన్మానించటం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. గతంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు లీగల్ విభాగం కృషి ఎనలేనిదన్నారు. 2024 ఎనికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ శ్రేణులపై, కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని, కూటమి పెట్టే ప్రతి అక్రమ కేసుపై లీగల్ విభాగం ద్వారా న్యాయస్థానాల్లో పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైతం న్యాయవాదుల కృషి ఎంతగానో ఉండబోతోందన్నారు.

మహత్తర శక్తిగా లీగల్ విభాగం

ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కూటమి కుట్రలను చేధిస్తూ.. వైఎస్సార్ సీపీ నేతల నుంచి కార్యకర్తల వరకు తామున్నామనే ధైర్యాన్ని కలిస్తున్న న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి అధికారంలో వచ్చిన తరువాత జరుగుతున్న దారుణాలను ఎదుర్కొనేందుకు ఒక మహత్తర శక్తిగా లీగల్ విభాగం పనిచేస్తోందన్నారు. కచ్చితంగా రాబోయే రోజుల్లో న్యాయవాదులకు మంచి చేసేలా వైఎస్ జగన్ అనేక గొప్ప నిర్ణయాలు తీసుకుంటారన్నారు. పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో లీగల్ విభాగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ముందుకు సాగుతామన్నారు. గుంటూరు పశ్చిమలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురువేసేందుకు న్యాయవాదుల ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. కూటమి పాలనలో అనేక అక్రమ కేసులు చూస్తున్నామని, వాటిపై న్యాయపోరాటం చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, కొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, సయ్యద్ బాబు, సోమసాని ఝాన్సీ, మంజుల, పోకల వెంకటేశ్వర్లు, హబీబుల్లా, వాసం సూరిబాబు, లలిత, వరదాయని, శ్యామల, ఇందిరా, శ్రీనివాసరెడ్డి, కళ్లం రమణారెడ్డి, సింగ్, బొమ్మనబోయిన శ్రీను, వజ్రాల రాజశేఖరరెడ్డి, బ్రహ్మారెడ్డి, కాసు వెంకటరెడ్డి, క్రాంతి, వేముల ప్రసాద్, స్వదీప్తి, తార, అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెరుకుపల్లిలో జాబ్‌మేళా

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో మదర్‌సన్స్ ప్రైవేటు లిమిటెడ్, డాక్టర్స్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, గోదావరి ఆంధ్ర కో–ఆపరేటివ్ సొసైటీ, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, హీరో మోటార్స్ వంటి ప్రముఖ కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై ఎంపికలు చేస్తారని పేర్కొన్నారు.ఆయా సంస్థల్లో 400లకు పైగా ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్హతను బట్టి జీతభత్యాలు ఉంటాయని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ చదివిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

అమరావతి: మండలంలోని ధరణికోట గ్రామపరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మరణించిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... మల్లాదికి చెందిన బుల్లా కుమార్ (32) ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై అమరావతి నుంచి మల్లాది వెళుతున్నాడు. ధరణికోట ఆర్‌వీవీఎస్ కాలేజీ సమీపంలో రోడ్డుపై వెళుతున్న గేదెను ఢీకొని కిందపడి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అమరావతి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

టీడీపీలో అంతర్గత విభేదాలు

నరసరావుపేటటౌన్: అధికార పార్టీలో అంతర్గత విభేదాలు వార్డు టీడీపీ ఇన్‌చార్జిపై దాడికి దారితీసింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డిపేటకు చెందిన బొప్పూడి శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి పదవితో పాటు 20వ వార్డు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నాడు. అదే వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు బత్తుల రాజశేఖర్‌తో విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటికి వెళ్తున్న శ్రీనివాసరావును కొందరు వెంబడించి తెలుగుదేశం పార్టీ పరంగా రాజశేఖర్‌కు వచ్చే పనులను అడ్డుకుంటున్నావంటా, నీ అంతు చూస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయంపై శ్రీనివాసరావు తన స్నేహితులతో కలసి రాజశేఖర్ ఇంటికి వెళ్లి వాగ్వివాదానికి దిగాడు. దీంతో శ్రీనివాసరావుపై రాజశేఖర్, అతడి భార్య రాళ్లతో దాడి చేశారు. దీంతో పాటు చాకుతో పొడవబోగా శ్రీనివాసరావు చేయి అడ్డుపెట్టడంతో వేళ్లు తెగాయి. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.విజయ్ చరణ్ ఆదివారం తెలిపారు.

నేడు ఉర్దూ బాలుర కళాశాలలో సీట్ల భర్తీ ప్రక్రియ

గుంటూరు ఎడ్యుకేషన్: నంది వెలుగురోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను సోమవారం అర్హులైన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో ఏడు, బైపీసీలో 19, సీఈసీలో 18 చొప్పున ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన బీసీ(బీ), బీసీ(ఈ) కేటగిరీలకు చెందిన పేద ముస్లిం, మైనార్టీ విద్యార్థులు సోమవారం సాయంత్రం లోపు కళాశాలకు నేరుగావచ్చి ప్రవేశం పొందాలని సూచించారు.

ప్రభుత్వ సంగీత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

నగరంపాలెం: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల (2025–26) విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక గాత్రం, వీణ, వయోలిన్, డోలు, మృదంగం, కూచిపూడి నృత్యం, నాదస్వరం విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సు అందుబాటులో ఉన్నాయన్నారు. సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు జూలై 1, 2025 నాటికి పదేళ్లు పైబడి ఉండాలని, డిప్లొమా కోర్సులో చేరేందుకు సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి జూలై 1, 2025 నాటికి 15 ఏళ్లు పైబడి ఉండాలని తెలిపారు. వయోపరిమితి లేదని, ఆసక్తి ఉన్న గృహిణులు, ఉద్యోగులు, విద్యార్థులు అర్హులేనన్నారు. మరిన్ని వివరాల కోసం గుంటూరు అశోక్‌నగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని తెలిపారు.

వ్యాపారవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేయూత



ప్రమాణ స్వీకారం చేస్తున్న జయకుమార్

గుంటూరు మెడికల్: వ్యాపార వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరు భాస్కరరావు అన్నారు. ఇటీవల నవ్యాంధ్ర ప్రదేశ్ ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గుడివాడ జయకుమార్, కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, కోశాధికారి వై.బి.శివారెడ్డిల ప్రమాణ స్వీకారం ఆదివారం పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొట్లూరు భాస్కరరావు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించి మాట్లాడారు. అసోసియేషన్ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గుడివాడ జయకుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్తులో అసోసియేషన్ తరఫున నూతన భవంతిని నిర్మించి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందాం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: బడి ఈడు పిల్లలందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తోందని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి ఉపాధ్యాయులు ప్రత్యేకమైన కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య పెరగటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై సమాజానికి, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు తమ పని విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు జూలై మొదటి వారంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కోసం ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు.

- రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి మాట్లాడుతూ బదిలీల చట్టం ద్వారా జరిగిన బదిలీల, ప్రమోషన్లలో ఉన్న అసంబద్ధాలను సరిజేయడానికి యూటీఎఫ్ అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేసిందని, తద్వారా మెజారిటీ ఉపాధ్యాయులకు న్యాయం చేసామని తెలిపారు.
- రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణం నియమించి, పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ మాట్లాడుతూ విద్యారంగ వికాసం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం పనిచేసే సంఘంగా యూటీఎఫ్‌లో సభ్యులుగా చేరాలని కోరారు. ఈసందర్భంగా ఊరి బడిలో పిల్లల్ని చేరుద్దామని వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో గుంటూరు జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, కోశాధికారి గయాసుద్దొలా, నాయకులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఎండీ షకీలాబేగం, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, బి.ప్రసాద్, కె.కేదార్నాథ్, కె.కామాక్షి, ఎం.కోటిరెడ్డి, పి.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

చీరాల అర్బన్: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చీరాలలో పట్టణశాఖ 20వ వార్షికోత్సవ వేడుకలను స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ ఎస్.పురుషోత్తం, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డీఈఓ ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల బలోపేతం చేయడానికి ఎన్‌రోల్‌మెంట్ పెరుగుదలకు ఇతోధికంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఉపాధ్యాయుల కృషిపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు ఊతమిచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. అనంతరం పేరాల్లోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో 35 సంవత్సరాలు పని చేసి పదవీవిరమణ చేసిన నాగళ్ల రమణారావు దంపతులను సత్కరించారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి గాజుల నాగేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా బాధ్యులు గడివాడ అమర్‌నాథ్, బడుగు శ్రీనివాస్, కె.ఎర్రయ్య, వి.ప్రభాకరరావు, ఎం.ఏసురత్నం, టి.వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పార్వతి, అపర్ణ, రమేష్, సుబ్బారెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనలు అడ్డుకునేందుకు బాబు కుట్ర



అభినందన సభలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



వెంకటరెడ్డి, అంబటి, మేరుగ, అశోక్‌బాబును సన్మానిస్తున్న కార్యకర్తలు

చుండూరు(వేమూరు) : మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక కుట్రలు చేస్తున్నాడని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పేర్కొన్నారు. చుండూరు మండలంలోని కారుమూరివారి పాలెంలో పార్టీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డికి అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కారుమూరు పాలెం గ్రామానికి చెందిన కారుమూరు వెంకటరెడ్డిని పార్టీ అధికార ప్రతినిధిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియామకం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలీసులకు తనకు ఎలాంటి ఆస్తి తగాదాలు లేవని, తన ఆస్తి వైఎస్సార్ సీపీ కార్యకర్తలేనని చెప్పారు. వారికి ఏ సమస్య వచ్చినా ఎదురు నిలబడి పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షులు మేరుగ నాగార్జున మాట్లాడుతూ పార్టీ కోసం కష్టకాలంలో పని చేసిన కార్యకర్తలకు ఎప్పుడూ గౌరవం ఉంటుందని తెలిపారు. రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త ఈపూరు గణేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా సూపర్ సిక్స్‌లు అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే పథకాలు అమలు చేసిన ఘనత దక్కిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు పక్కన పెట్టి కక్ష సాధించే పరిపాలన చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి చలంచర్ల సుధారాణి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హిజ్రాలకు గుర్తింపు ఇచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా పాలన సాగిందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు ఉయ్యూరి అప్పిరెడ్డి, మండల అధ్యక్షులు అన్నపురెడ్డి రఘురామిరెడ్డి, వేమూరు, అమర్తలూరు మండలాల పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు, హిమచంద్ర శ్రీనివాసరావు, ఎంపీపీ జాలాది రూబేను, రాపర్ల నరేంద్ర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోగంటి లవకుమార్, జెడ్పీటీసీ సభ్యులు దాట్ల సౌజన్య మోహన్‌రెడ్డి, బి. నాంచారమ్మ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిధులు పంచాయతీలకు జమ చేయాలి

పంచాయతీరాజ్ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆలా లక్ష్మీనారాయణ



పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి దారి మళ్లించిన నిధులను పంచాయతీలకు జమ చేయాలని వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఆలా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ రూపొందించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమస్యపై సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని సర్పంచులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పంచాయతీలకు రావాల్సిన జనరల్ ఫండ్స్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులను తల్లికి వందనం పథకానికి దారి మళ్లించారని చెప్పారు. కేవలం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీల్లో ఉన్న సర్పంచులు 80 శాతం మంది వైఎస్సార్ సీపీకి చెందిన వారు కావటం వలన పంచాయతీలకు నిధులు ఇవ్వడంలేదని అన్నారు. కనీసం శానిటేషన్ కూడా చేయలేని పరిస్థితి పంచాయతీలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనికి ఆహార పథకంలో ఉన్న కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సగం కూలీ డబ్బులు తమకి ఇస్తేనే డబ్బులు ఇస్తామని అంటున్నారని విమర్శించారు. మీకు ఇంత, మాకు అంత అనే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పేద వాళ్లకు పనిలేకుండా చేస్తున్నారని అన్నారు. పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల చక్రారెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు సంబంధించిన నిధులు తల్లికి వందనం వంటి పథకాలకు దారి మళ్లించడం అన్యాయమని అన్నారు. దీనివల్ల ఒక పంచాయతీలో కూడా చిన్నపని కూడా చేయలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం కూడా సర్పంచులకు వర్తింపజేయకుండా ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. రొంపిచర్ల మండల పార్టీ కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.